పాడిఆవు

గుడిసేవ సుందరరామయ్య

'తాతయ్యా!' అన్న పిలుపు వినగానే గోపయ్య మెల్లగా కళ్లు విప్పాడు. ఎదురుగా గంగ కన్పించింది. నీలం రంగు లంగామీద గులాబి రంగు జాకెట్టు వేసుకొంది.

చెవులకు వ్రేలాడుతున్న రోల్డ్‌గోల్డ్ రింగులు, ముందుకు వేసుకొన్న జడ, ఆ జడలోని ముద్దబంతులు, మెళ్లో వున్న పూసల పతకం — గంగ శరీరానికి మరింత నిండుదనాన్నిచ్చాయి. గంగను చూస్తుంటే ఛెంగు ఛెంగున గెంతే లేగదూడ గుర్తుకు వచ్చింది గోపయ్యకు. నిగనిగలాడే బుగ్గలు, చక్రాల్లాంటి కళ్లు, పల్చటి పెదాలు ఎంతో ముద్దు రాగా గోపయ్య ఉత్సాహంగా మంచమ్మీదినుంచి లేవబోయాడు. కాని అంతలోనే కాలు, చెయ్యి అభ్యంతరం చెప్పాయి. తన పరిస్థితికి కన్నీరు కార్చాడు గోపయ్య. గంగను దగ్గరకు తీసుకొన్నాడు. గోపయ్య ముఖంలోకి చూస్తూ అడిగింది గంగ 'తాతయ్యా! టీ తాగావా?' అని.

ఆ ప్రశ్న వినగానే గోపయ్య గుండె ఝల్లుమంది.

మనసు గతంలోకి పరిగెత్తింది.

*   *   *

గోధూళివేళ.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు క్రమేపీ పెరిగారు. కొంతమంది అడ్డదార్లవెంట లోపలికి వెళ్లటానికి ప్రయత్నిస్తున్నారు. డ్యూటీ దిగిన గోపయ్య భుజాన వున్న బెల్టును తీసి మడతపెట్టి చేత్తో పుచ్చుకొన్నాడు.

'ఏం బావా! కాంటీన్‌కెళ్లి టీ తాగొద్దామా?' భుజమ్మీద చేయి వేసి అడిగాడు తోటి బంట్రోతు రాములు.

'నే రాలేనోయ్!'

'అదేమిటోయ్! కొత్తగా మాటాడుతున్నావ్! బిల్లు నేనే యిస్తాలే?' గర్వంగా అన్నాడు రాములు.

'ఇవ్వాళ ఏమాత్రం సంపాయించావేమిటి?'

'ఆ ఏడుకొండలవాడు సల్లగా వుండాలేకాని మనకు కరువేంటి బావా?'

'చేస్తున్న పాపానికి ముందు ముందు ఫలితం అనుభవించాలన్న విషయం గుర్తుంచుకో!'

'పిచ్చోడా! పాపం అని మడికట్టుక్కూర్చుంటున్నావు కాబట్టే వాళ్లిచ్చే జీతం రాళ్లతో బతుకుతున్నావు. నీకేదో ఆ పాల వ్యాపారం వుంది కాబట్టి సరిపోయింది. మరి నాలాంటోడికి ఆ జీతం రాళ్లు ఏం చాలుతాయి?'

'అవునుమరి రెండు సంసారాలుగా!'

'నెమ్మదిగా అను బావా! ఎవరైనా వినగల్రు!'

'చేస్తున్న పనికి సిగ్గులేనప్పుడు ఎవరో వింటారని భయమెందుకయ్యా! దేవతలాంటి యిల్లాలుండగా ఆ నాంచారమ్మ యింటికి పోతావెందుకు?'

'బావోయ్! కళ్లు పోతాయ్ జాగర్త! ఆ ఏడుకొండలవాడు, నిన్ను శపిస్తాడు. ఆడిక్కూడా నాంచారమ్మ వుంది సుమా!'

'వెర్రిరాములూ, ఆ స్వామికి నీకు పోలికా? నీవు చేస్తున్న పనికి ఆయన క్షమిస్తాడా?'

'ఏం నేనేం తప్పు చేస్తున్నాను. భక్తులు అర్జెంటుగా దేవుణ్ణి చూసే ఏర్పాటు చేస్తున్నాను.'

పరమాణు యుగానికి తగిన దేవుడు

అమెరికాలో "శివదర్శనం"

గత మాసాంతంలో అమెరికన్ ప్రాచీన రాజధానీ నగరమైన ఫిలడెల్ఫియాలో "శివుడు ప్రత్యక్షమైనాడు". "శివరూపాలు" అనే అపూర్వ కళా ప్రదర్శనం ఒకటి మార్చి 29న ఆ నగరంలోని ఫిలడెల్ఫియా మ్యూజియమ్ ఆఫ్ ఆర్ట్స్‌లో ప్రారంభమైంది.

ఈ ప్రదర్శనలో సుమారు 200 దాకా ప్రాచీన భారతీయ చిత్రాలు, రాతి, కాంశ్య శిల్పాలు ఉన్నాయి. వీటిలో అతి ప్రాచీనమైనవి, దాదాపు 2000 సంవత్సరాల నాటివి కూడా ఉన్నాయి.

ఈ ప్రదర్శనాన్ని కూర్చినవారు డాక్టర్ స్టెలా క్రామ్‌రిష్. ఇండియాలో వివిధ ప్రాంతాల నుంచి, పురావస్తు ప్రాముఖ్యత గల ప్రదేశాల నుంచి, అమెరికా, ఐరోపా దేశాలలోని ప్రసిద్ధ మ్యూజియమ్‌ల నుంచి సంవత్సరాల తరబడి శ్రమించి సేకరించిన కళాఖండాలివి. శివుని విభిన్న రూపాలకు, శైవ సిద్ధాంతానికి ప్రాతినిధ్యం వహించే కళారూపాలివి.

"ఈ ప్రదర్శనంలోని శివుని వివిధ రూపాలను సందర్శించినప్పుడు ప్రేక్షకునికి ఒక అపూర్వానుభూతి కలుగుతుంది. శివుడంటే ఏమిటి ? శైవం అనగా ఏమిటి ? అనే నిగూఢ ప్రశ్నలకు జవాబు పొందటానికి వీలు కల్పించే ప్రదర్శనమిది. శైవ తత్వం విశ్వజనీనమైనదన్న భావన, ఈ కళాఖండాలను నిశితంగా పరిశీలించినప్పుడు, కలుగకమానదు" అని డాక్టర్ క్రామ్‌రిష్ అంటారు.

"నేటి పరమాణు యుగానికి తగిన దేముడు ఎవరైనా ఉన్నాడంటే, ఆ దేముడు శివుడే. శివతాండవం నేటి యుగానికి తగినది. శివతాండవంలో క్షయంతోపాటు తుల్యత ఉన్నది, లయమకం ఉన్నది — ఈ రెండు లక్షణాలను సృష్టికి, జీవితానికి పోల్చవచ్చు" అని అమెరికాలో భారత రాయబారి శ్రీ నారాయణ్ అన్నారు.

ఈ మ్యూజియమ్‌లో "శివదర్శనం" ప్రదర్శనతోపాటు, మరి ఎనిమిది ఫిలడెల్ఫియా సాంస్కృతిక సంస్థలు భారతీయ కళా సంస్కృతులకు సంబంధించిన ఉత్సవాలు నిర్వహించబోతున్నాయని ఆ నగర మేయరు విలియమ్ జె. గ్రీన్ చెప్పారు. ఇండో — అమెరికన్ ఉప సంఘ కృషి ఫలితంగా అమెరికన్ సమకాలీన కళాఖండాలు ఇండియాలో ప్రదర్శించబడుతున్నట్లు ఆయన చెప్పారు.

"భారతదేశం ఒక మహోన్నతమైన ప్రాచీన సంస్కృతీ నిలయం. అందుకు భిన్నమైన సంప్రదాయంలో అభివృద్ధి చెందిన మాకు భారతీయ సంస్కృతి, ఇతిహాసాలను గురించి తెలుసుకోగల అవకాశం, ఈ గొప్ప ప్రదర్శన ద్వారా లభించింది" అన్నారు మేయరు గ్రీన్.

ఈ ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఉంటున్న విజయ ప్రకాష్ కన్నుల విందుగా భరతనాట్యం చేశారు.

28వ తేదీ ప్రివ్యూ సందర్భంలో కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలు ఏర్పాటు చేశారు. రీతాదేవి ఈ నృత్యాలు చేసి సదస్యుల మన్ననలు పొందారు. విమల రాజగోపాల్ దక్షిణ భారత జానపదగేయాలు పాడారు. అక్కడి స్థానిక భారతీయ బృందాలవారు వివిధ రకాల బృంద నృత్యాలు జరిపారు. ఈ ప్రదర్శన తొలిరోజు 5500 మంది ప్రజలు వచ్చి చూచారు. ఫిలడెల్ఫియా టెలివిషన్ కేంద్రం ఈ ప్రారంభోత్సవంపై అరగంట కార్యక్రమం ప్రసారం చేసింది. దీని తరువాత ఈ కేంద్రం మాల్కన్‌లే నిర్మించిన ఇండియా గురించిన ఒక వార్తా చిత్రాన్ని కూడా ప్రసారం చేసింది.

"భారత వర్షం — బహుముఖాలు — బహురీతులు" అనే పెద్ద కార్యక్రమాన్ని ఫిలడెల్ఫియాలోని అయిదు సాంస్కృతిక సంస్థలు నిర్వహించాయి.

— ఆర్. ఆర్. బర్త్రా

'మరి వాళ్లదగ్గర లంచంగా అయిదులు, పదులు తీసుకోటం తప్పుకాదా ?'

'ఓపికున్నప్పుడు, అవకాశం వచ్చినప్పుడు సంపాదించకపోతే మరెప్పుడు సంపాయిస్తాము బావా ? నిన్నగాక మొన్న కొత్త కోడలొచ్చింది నీకు. ఏదో నాల్రోజులుబాగా చూస్తది. కాని ఎల్లకాలం ఆళ్లకు నీ మీద ప్రేమలుంటాయను కొన్నావా ?'

ఇద్దరూ నడ్చుకొంటూ రోడ్డుమీదికి వచ్చారు.

'నీకు తెలీదు రాములూ! నా కొడుకు శ్రీరాముడిలాంటివాడు. నా కోడలు సీతమ్మ తల్లి. నా కోడలు పరాయిది కాదు. నా సొంత మేనకోడలు. చిన్నప్పుడే దాని తల్లి చచ్చిపోయింది. దాన్ని న కోడల్ని చేసుకుంటానని మాటిచ్చాను. అలానే చేసుకున్నాను. ఈనాడు నీతో టీకి రానంటున్నాను. ఎందుకోతెలుసా ? మా కోడలు నేను వెళ్ళేసరికి వేడి వేడి టీ కాసి నాకు యిస్తది. నేనంటే దానికెంతో అభిమానం !'

'అదృష్టవంతుడివి! మా టల్లోపడి కాంటీన్ దగ్గరకొచ్చాం. నీ వెళ్లి నీ కోడలి దగ్గరే టీ తాగు! ఇదెంత కాలమో

పాడి ఆవు

చూస్తాగా!' ఎగతాళిగా నవ్వాడు రాములు.

'పిచ్చివాడు!' అనుకొంటూ ఇంటికి వెళ్లాడు తను.

తను వెళ్లేసరికి కాళ్లు కడుక్కోటానికి నీళ్లిచ్చి తుండు చేతికిచ్చేది కోడలు. తను కాళ్లు కడుక్కొని బట్టలు మార్చుకొనేసరికి వరండాలో వాలు కుర్చీ వేసేది. ఇంట్లోకి వెళ్లి గబగబ వచ్చి వేడి వేడి టీ తనకు అందించేది.

'నువ్వొచ్చాక ఈ టీ వొకటి అలవాటయిందమ్మా!' అని తనంటే —

'అదేంటి మామయ్యా! మీరు పగలంతా పనిచేసి అలసిపోతారు. ఓ కప్పు టీ కూడా తాగకపోతే ఎలా ?' అనేది.

'మీ అత్తయ్య చాలా దురదృష్టవంతురాలమ్మా!'

'ఏంటి మామయ్యా నీవనేది ?'

'అవునమ్మా! కోడలిచేత సేవలు చేయించుకోలేకపోయిందది !'

'అత్తయ్యకు సేవచేసే భాగ్యం నాకే కల్గలేదు. నేనే దురదృష్టవంతురాల్ని మామయ్యా!' అని కళ్లనీళ్లు పెట్టుకొనేది జయమ్మ.

అలాంటి జయమ్మ ఎంతమారిపోయింది?!

ఈ మార్పుకు కారణం ఏమిటి ?

తన దురదృష్టమా? లేక కాలమహిమా?

"ఏంటి ? పండుకొన్నావా ?" జయమ్మ అరుపు విన్పించగానే ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు గోపయ్య.

"టీ తెమ్మని గంగకు చెప్పావా?" కోపంగా అడిగింది.

"లేదమ్మా! నేను చెప్పలేదు. నాకెందుకు టీ ?" మెల్లగా గొణిగాడు గోపయ్య.

"డాక్టర్‌గారు టీ యివ్వద్దని చెప్పాడు అంతేకాని నీకు యిస్తే మా ఆస్తులు తరుగుతాయని భయపడి కాదు, నీకు టీ ఇవ్వటం మానేసింది !"

"అక్కర్లేదమ్మా! ఏదో చంటిపిల్ల కదా! నా మీద ప్రేమకొద్దీ టీ యిద్దామనుకొంది.. అలా చేయవద్దని కేకలేస్తాలే !"

"ఆహాహా! ఎంత చమత్కారం! అక్కడికి దానికి ఒక్కదానికే నీ మీద ప్రేమ వున్నట్లు మా కెవ్వరికీ లేనట్లా ? మీ అబ్బాయి మంచోడు కాబట్టి డాక్టర్‌కు బోలెడంత

పాడి ఆవు

తగలేసి నీ రోగానికి మందులిప్పిస్తున్నాడు. ఆ మాత్రం మనుషుల్ని అర్థం చేసుకొనే జ్ఞానం కూడా లేకపోతే ఎలా ?'' అంటూ రుసరుసలాడుతూ లోపలికి వెళ్లింది జయమ్మ.

'నీ మొగుడు ఎవరి డబ్బో వాకు ఖర్చు పెట్టడంలేదే ! నేను సంపాదించుకొన్న ఆస్తినే నేను తింటున్నాను. ఒక ఆవుతో వుండే ఇంటిని పది ఆవుల పాడివేయుటానికి కారణం నా రెక్కల కష్టమేనే !' బిగ్గరంగా అరవాలనుకొన్నాడు గోపయ్య. కాని జయమ్మ నోటికి భయపడి ఆ ప్రయత్నం మాను కొన్నాడు.



ఈనాడు సీతయ్య ఓ మనిషిగా నిలబడ్డాడంటే అందుక్కారణం తనే. చిన్నప్పట్నుంచీ వాడికి చదువుమీద శ్రద్ధ వుండేది కాదు. ఏ మాత్రం డబ్బులున్నా తిరుపతెళ్లి సిన్మాలు చూసొచ్చేవోడు. అతి కష్టమ్మీద ఎనిమిదో క్లాసు వరకు చదివాడు. పోనీ పాలవ్యాపారంలో పెడదామంటే శరీర కష్టం పడలేనివాడు. ఓ ప్రక్క బంట్రోతు వుద్యోగం చేస్తూ సంసారాన్ని ఈదుకొస్తూ, ఓ ఆవుకొన్నాడు తను. గొడ్డొచ్చిన వేళ, బిడ్డొచ్చిన వేళ అంటారు. లక్ష్మి నిజంగా ఆవు కాదు. తన పాలిట దేవత. అది వచ్చాక తనకు బాగా కలిసివచ్చింది. దాని పాలమీద వచ్చిన డబ్బును బ్యాంకులో దాచి మరో రెండు ఆవులను కొన్నాడు. అలా అలా కూడబెట్టిన సొమ్మును పెట్టి తను ఆవులను కొన్నాడు. కోడలు వచ్చేసరికి తమింట్లో పది ఆవులపాడి వుండేది. కోడలు కూడా ఆవులను జాగ్రత్తగా చూసుకొనేది. సీతయ్య మాత్రం ఇంటి పని ముట్టుకొనేవాడు కాదు. వాడికేదైనా వుద్యోగం చూడాలను కొంటున్న సమయంలో తనకీ పాడు జబ్బు వచ్చి మూలపడ్డాడు. తన వుద్యోగం సీతయ్యకిచ్చారు. తను మూలపడ్డాక సంసారంలో రకరకాల మార్పులు వచ్చాయి. కొడుకు, కోడలు యింతకు ముందులా తనతో మాట్లాడటంలేదు. తన విషయం వచ్చేసరికి చిరాకుపడిపోతున్నారు. తను మాట్లాడుతుంటేనే ఖస్సుమంటున్నారు. పెట్టెడన్నం పెట్టడమే వాళ్ల కెంతో బాధగా వుంది. నిజంగా దేవుడనేవాడు వున్నాడు కాబట్టే పక్షవాతం వచ్చినా తను పూర్తిగా మంచంపాలు కాలేదు. కర్ర వూతతో మెల్లగా తిరిగే స్థితిలోనే వున్నాడు. తను పుణ్యం చేసుకోబట్టే గంగలాంటి మనవరాలు దొరికింది.

''తాతయ్యా ! ఇదిగో టీ !'' అంటూ గంగ టీ కప్పు అందించేసరికి తన ఆలోచనలను కట్టిపెట్టి కన్నీళ్లతో—

''వద్దమ్మా ! మీ అమ్మ తాగవద్దంటోంది !'' అన్నాడు గోపయ్య.

''అమ్మే పంపించింది. తాగు తాతయ్యా!'' అంటూ టీ కప్పును గోపయ్య నోటికి అందించింది గంగ.

మెల్లగా లేచి కూర్చుని కప్పును అందుకొన్నాడు.

గోపయ్య టీ త్రాగుతుంటే ఎంతో తృప్తిగా చూసింది గంగ.

''టీ బాగుందా తాతయ్యా ?''

''చాలా బాగుందమ్మా ! నీ చేత్తో యిచ్చావుగా మరి ! అవును ! నువ్వు టీ తాగావా ?''

''లేదు తాతయ్యా ! నేనే తాగుతానని అమ్మతో అబద్ధం చెప్పి ఈ టీ తెచ్చాను.''

గంగ అలా అనేసరికి గోపయ్య గుండె ఝల్లుమంది.

ఖాళీ చేసిన కప్పును ప్రక్కనపెట్టి గంగమ్మను ఒడిలోకి తీసుకొని ''నా బంగారు తల్లి !'' అంటూ ముద్దులతో నింపాడు.

* * *

ఆ రాత్రి గోపయ్యకు నిద్ర పట్టలేదు.

కనీసం ఓ కప్పు టీ క్కూడా నోచుకోలేని తన బ్రతుకు వ్యర్థమనిపించింది.

తనకీ జబ్బు లేకపోతే తన వుద్యోగం పోయేదికాదు.

తన కోడలు తనకు ఎన్నో మర్యాదలు చేసేది.

తన బ్రతుకు మరో రకంగా వుండేది.

తనలాంటి స్థితి పగవాడిక్కూడా వద్దు !

రెండు చేతులతో దణ్ణంపెడుతూ ఇంటి కప్పువైపు చూస్తూండిపోయాడు గోపయ్య.

అప్పటికి బాగా ప్రొద్దుపోయింది.

ప్రక్క గదిలోంచి సన్నగా మాటలు విన్పించాయి గోపయ్యకు. కోడలు కొంచెం విసురుగా మాట్లాడుతోందని గ్రహించిన గోపయ్య మెల్లగా గది ప్రక్కకు తిరిగి కిటికీ వద్ద తలపెట్టాడు

''నువ్వేన్నయినా చెప్పు ! మా నాన్న యిక్కడకు రావాల్సిందే ! ఈ గొడ్ల చాకిరీని నేనొక్కదాన్నే చేయలేకపోతున్నాను. అవతల మీ నాన్నేమో మంచానపడ్డాడు. ఈ చాకిరీ నేను చేయలేను!'' గట్టిగా చెప్తూంది కోడలు.

''పోనీలేవే! పాలేరును పెట్టుకొందాములే !'' నచ్చచెప్తున్నాడు కొడుకు.

''మళ్లీ వాడిక్కూడా తిండి దండగ. మా నాన్నకు మాత్రం ఎవరున్నారు ? మా వూళ్లో ఒంటరిగా వుండటంకంటె యిక్కడకు వచ్చి మనకు చేదోడువాదోడుగా వుంటే నయం కదూ !''

"బాగానే వుంటుంది. కాని మన యిల్లు మూస్తే యిరుకు కదా! ఎండాకాలం ఎట్లా సర్దుకుపోయినా వానాకాలం కష్టం కదా!"

"కష్టమేముంది? ఆ వరండాలోనే వుంటాడు!"

"మరి మా నాన్న!"

"పొద్దున్నే లేవగానే పెద్దావు ముఖం మూడాలంటాడుగా! దాని పక్కనే మంచం వేద్దాం!"

"ఏమిటి గొడ్లసావిట్లోనా?"

"ఏం? అది మాత్రం మన యిల్లు కాదా! కళ్ళు మూసుకొని పండుకొనేవాడికి గొడ్లపాకయినా ఒకటే డాబా యిల్లయినా ఒకటే!"

"చాల్లే! పిచ్చి పిచ్చిగా వాగకు! నాన్న వింటే బాధపడ్తాడు. కళ్ళు మూసుకొని పండుకో!"

"అలాగే పండుకొంటా కని మా నాన్నను రమ్మని రేపు వుత్తరం రాస్తావా?"

"చూద్దాంలే!"

గోపయ్య కళ్ళల్లో ఉప్పెన!

గోపయ్య గుండెల్లో భూకంపం!

ప్రపంచమంతా తనను శత్రువులా చూస్తున్నట్లు ఫీలయ్యాడు. గొడ్లపాకలో పండుకోటం తనకు చిన్నతనం కాదు. మనసుల్లేని ఈ మనుషుల మధ్య మసలేకంటే మమతలు చూపే ఆ మూగజీవుల మధ్య జీవించటంలో తృప్తి వుంది. అయితే ఒకప్పుడు ఎంతో బాగా బ్రతికిన తను ఈనాడు గొడ్లపాకలో గతిలేక కాపురం చేయాలా? తనకంటే తన వియ్యంకుడు ముఖ్యమా? అవును మరి! తన పరిస్థితే తన దురదృష్టా

పాడి ఆవు

నికి కారణం! ముందు వచ్చిన చెవులకంటె వెనుక వచ్చిన కొమ్ములు వాడిగానే వుంటాయి. ఆ గొడ్లపాకలో నికృష్టంగా బ్రతికేకంటె కొంచెం విషం మింగి చావటం మేలు. కనీసం తన కొడుక్కయినా తనంటె జాలి లేదా? ఈ ఘోరాన్ని ఆపలేడా? పెళ్ళాం మాటలు విని తనను గొడ్లపాకలోకి వెళ్ళగొడ్తాడా? వీల్లేదు ... వీల్లేదు ... అలా జరగటానికి వీల్లేదు. ఆలోచిస్తూనే నిద్రపోయాడు గోపయ్య.

* * *

తెల్లవారింది.

ఇల్లంతా ఎంతో సందడిగా వుంది.

ఈ రోజు కృష్ణాష్టమి!

జయమ్మ పొద్దున్నేలేచి ఆవులన్నింటికీ ఒళ్ళురుద్ది నీళ్ళుపోసి పసుపు కుంకుమలతో అలంకరించింది. రంగు రంగుల పూలను మాలలుగా కట్టి కొమ్ములకు చుట్టింది.

ఈ పండుగను తల్చుకొంటే పాత రోజులు గుర్తుకొచ్చాయి గోపయ్యకు. తనెంతో సరదాగా యీ పండుగ చేసేవాడు. బజార్లో రంగు డబ్బాలు కొనుక్కొచ్చి ఆవులకొమ్ములకు రంగులు వేసేవాడు తను. ప్రతి ఆవు ముఖాన పసుపు పూసి కుంకుమ బొట్టు పెట్టేవాడు. దేవుడి గుడిచుట్టూ తిప్పి గులాం చల్లి ఇంటికి తోలుకువచ్చేవాడు. కోడలు ఆ రోజు పాయసం చేసి దేవుడికి ఆరగింపు పెట్టి ముందుగా తనకే వడ్డించేది.

అలాంటి పండుగ ఈనాడు ఎంతో చప్పగా వున్నట్లుంది తనకు. తను ఓపిక చేసుకొని ఆవుల నుదుట కుంకుమదిద్దటానికి సిద్ధపడినా కోడలు అందుకు ఒప్పుకోదు. తన నీడంటేనే మండిపడుతూంది. ఈ ఇంట్లో తనిప్పుడు పెద్ద అడ్డుగోడలా వున్నాడు.

గంగ పరుగు పరుగున రావటంతో గోపయ్య తలెత్తి చూశాడు.

"తాతయ్యా! ఇలారా ఓసారి!" హడావుడిగా అంది.

"ఎందుకమ్మా?" మెల్లగా అడిగాడు గోపయ్య.

"రా తాతయ్యా! చెబుతాగా!" అంటూ కర్ర అందించింది. కర్రసాయింతో గోడను ఆసరాగా తీసుకొని మెల్లగా గంగ వెంట ప్రక్క గదిలోకి వెళ్ళాడు.

"బీరువాపైన పసుపు డబ్బా, కుంకుమ డబ్బా వుంది తాతయ్యా! అవి రెండూ అందుకొని నా కివ్వు!" అంది గంగ పైకి చూపిస్తూ.

చేతులతో తడిమి రెండు డబ్బాలను తీసి గంగకు అందించాడు.

"ఇవి నీ కెందుకమ్మా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపయ్య.

"చూడు తాతయ్యా! మరి అమ్మ ఏం చేసిందో?"

"ఏం చేసిందమ్మా?"

"ఈ రోజు పండగ్గదా! ఆవులన్నింటికీ పసుపు రాసి కుంకుమ పెట్టింది. కాని పెద్దావుకు మాత్రం ఏమీ చేయలేదు. అసలు దానికి తెలగపిండి, తౌడు కూడా పెట్టడంలేదు తాతయ్యా! పాపం! పెద్దావు కాళ్ళు పడిపోయి పాకలో కదల్లేక పండుకొంది తాతయ్యా!" జాలిగా చూసింది గంగ.

"రేపో మాపో చచ్చేదానికి దానికెందుకమ్మా పసుపు కుంకుమ" విరక్తిగా నవ్వాడు గోపయ్య.

"తాతయ్యా! పాపం! పెద్దావుకు ఎంత ఆకలేస్తోందో?"

"దాని ఆకలి అందరికీ అర్థంకాదమ్మా! అది పాడి ఆవు కాదుగా!" అంటూ బయటకు రాబోయిన గోపయ్యకు ఎదురుగా గుమ్మంలో జయమ్మ కన్పించేసరికి తల వంచుకొని వరండాలోకి వెళ్ళిపోయాడు.

గోపయ్య వెళ్ళిన దిక్కే జయమ్మ చూస్తూండిపోయింది.